

కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్

పాలకుల విధానాలపై పోరాటానికి సిద్ధం



- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్ పిలుపు
- ఉద్యోగ, కార్మిక, కర్షక వ్యతిరేకి మోడీ ప్రభుత్వం
- కార్మిక, కర్షక సంఘాల భారీ ప్రదర్శన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న మహిళా కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉద్యోగ, కార్మిక, కర్షక వ్యతిరేకమైన ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని మోడీ ప్రజా వ్యతిరేకమైన విధానాలకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి ఎంఏ.గఫూర్ మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నదని విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న చట్టాలను మార్చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధానాలు అనుసరిస్తుందని అన్నారు. పెట్టుబడుదారులకు అనుకూలమైన విధానాలు తీసుకొచ్చిందని తెలిపారు. ఈజ్ఆఫ్‌డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. 375 రోజులు కొనసాగిన రైతు ఉద్యమం సందర్భంగా నరేంద్ర మోడీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. కార్మికుల పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి బడా పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలను చేశారని అన్నారు. వాటిని రద్దు చేసే వరకు పోరాటాలు చేయాలన్నారు. రైతుల సంక్షేమం కోసం బడ్జెట్ పెంచి ఆదుకోవాలని అన్నారు. విశాఖ ఉక్కు మూతపడే విధంగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు కావడంలేదని, కట్టు బానిసలుగా బతుకు ఈడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీలకు ఊడిగం చేసే ప్రభుత్వాలను గద్దె దింపి, బుద్ధి చెప్పడానికి ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు జగన్నాథం ,రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు నష్టదాయకమైన విధానాలు అనుసరిస్తుందన్నారు. కనీస మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతులకు అప్పులు పెరిగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మర్శించారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, ఎపికెఎస్ నాయకులు మల్లికార్జున, టియుసిఐ నాయకులు తిరుపాలు, ఐఎన్‌టియుసి నాయకులు సుంకన్న, ఎస్‌యుసిఐ జిల్లా నాయకులు నాగన్న, ఐఎఫ్‌టియు నాయకులు భాస్కర్, ప్రగతిశీల రైతు సంఘం నాయకులు వి. అర్లప్ప, తదితరులు మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయి,న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ్, సిఐటియు నాయకులు రాముడు, రాజశేఖర్, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, నగర అధ్యక్షులు వెంకటేష్ నగరనాయకులు రామకృష్ణారెడ్డి, గూడూరు సిఐటియు నాయకుడు మోహన్, కల్లూరు సిఐటియు మండల కార్యదర్శి మధు, కర్నూలు మండలం వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు గోపాల్, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కాజాపాష, జిల్లా కార్యదర్శి సుధాకరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగన్న అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రేణుకమ్మ, నగర నాయకులు బాలదుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక సంఘాల భారీ ప్రదర్శన

కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నుండి ఆయా సంఘాల బ్యానర్లు , జెండాలు పట్టుకొని ' కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ కార్మిక వ్యతిరేకవిధానాలు నశించాలి. రైతులకు మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలి. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి.' అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ రాజువిహార్ మీదుగా కార్మికులు కర్షకులు మహిళలతో కలెక్టరేట్ చేరుకుంది. అక్కడ ధర్నా చేశారు.

ఆలోచింపచేసిన ప్రజానాట్యమండలి గేయాలు

ప్రజానాట్యమండలి కళాకారులు రాజు, లోకేష్, బాలు, మద్దిలేటి, బతుకన్న, సుంకన్న లు ఆవాజ్ దో హంఏక్ హై, భారత్ కా శ్రామిక్ ఏక్ హై, మన రక్తం ధారపోసి పెంచిన సంపదను బడా బాబులకు ధారాధాత్తం చేద్దామా? అమ్ముతుంటే చూస్తూ ఉందామా?, మోడీ దొంగల బండి యమ జోరుగా ఉందండి, మేక్ ఇన్ ఇండియా మేకపోతు గాంభీర్యం, లోపల అంతా లొటారం పైన చూస్తే పటారం, అంటూ పాడిన గేయాలు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు వచ్చిన వారిని ఆలోచింపచేసాయి.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అభ్యుదయ గీతాలు ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అన్ని వర్గాలకు సమన్యాయం
- మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి మంత్రి , జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష ఎమ్మెల్యేలు గౌరుచరితరెడి, బికె. పార్థసారథి, విరుపాక్షి ,ఎమ్మెల్సీ మధుసూదన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో ఒక గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఈ రాజ్యాంగం ద్వారా దేశాన్ని అన్ని విధాలా పురోగతి వైపు ఏ విధంగా తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గుర్తు చేసుకుంటూ, రాజ్యాంగ స్ఫూర్తితో మనమందరం ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి కంట్రోల్ రూం వరకు ర్యాలీ నిర్వహించారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి భరత్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత

పోలీస్ శాఖలో భారత రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు క్రైమ్: భారత రాజ్యాంగం ఆమోదించి నేటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి కర్నూలు అడిషనల్ ఎస్‌పి జి. హుస్సేన్‌పీరా పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ.. మన దేశానికి ఒక ప్రత్యేకమైన రాజ్యాంగం కోసం అంబేద్కర్ లాంటి మహానుభావులు కృషి చేసి రాజ్యాంగాన్ని తీసుకు వచ్చారన్నారు. రాజ్యాంగం ఆమోదించి నేటికి 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ దినోత్సవ వేడుకలను జరుపుకోవడం చాలా గర్వకారణమన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అందరితో భారత రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ, జావేద్. ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహోన్నతం.. భారత రాజ్యాంగం..

కర్నూలు కార్పొరేషన్ : భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలస్తంభమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. నగరపాలక కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మనకు ఎన్నో హక్కులు సంక్రమించాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తయారు చేయడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ పీఠికపై కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు.



జిల్లా యువజన సంక్షేమ శాఖ ర్యాలీలో కమిషనర్, తదితరులు

ఫామిదాబేగంకు విసి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్




ఫామిదా బేగంను అభినందిస్తున్న విసి సాయిగోపాల్

ఖతార్ లో జరిగిన ప్రపంచ సాహితీ సదస్సులో సిల్వర్ జూబ్లీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఫామిదాబేగం పత్ర సమర్పణ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ క్లస్టర్ యూనివర్సిటీ విసి డివిఆర్ సాయి గోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అభినందించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ చేస్తే క్లస్టర్ యూనివర్సిటీ గురించి ప్రపంచ వ్యాప్తంగా తెలుస్తుందన్నారు. సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రమణ్య కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బిఆర్ ప్రసాద్ రెడ్డి అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు కసరత్తు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు కసరత్తు చేస్తున్నామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక అధికారులతో కలిసి కమిషనర్ పాతబస్తీలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ పాతబస్తీలో ఇరుకైన రహదారులు, అధిక జనసంచారం, రహదారులపై వాహనాల పార్కింగ్ వంటి సమస్యల నుండి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పెద్దమార్కెట్ వద్ద విభాగిని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం కొండారెడ్డిబురుజు వెనుక భాగంలో ఉన్న పార్కును కమిషనర్ పరిశీలించారు. ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దిన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కుడా ఛైర్మన్‌కు గజమాలతో సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లను, మంత్రులు ఎన్ఎండి ఫరూక్ ను, టిజి.భరత్‌ను టిడిపి గార్గేయపురం మైనార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మైనార్టీ నాయకులు సోఫీబేగ్, సయ్యద్ అస్లాం బాష తదితరులు ఉన్నారు.

ఎల్ఎల్‌సి కింద 45వేల ఎకరాలకు సాగునీరు

-గాజులదిన్నె కింద రబీ పంటలకు సాగునీరు
-కర్నూలులోనే కృష్ణరివర్ బోర్డు కార్యాలయం
-ఐఎబి సమావేశం తీర్మానం
-హాజరయిన మంత్రి టిజి. భరత్ ,ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్ వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్ , అధికారులు

జిల్లాలో తుంగభద్ర ఎల్ఐసి కాల్వ కింద 45 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాలని, గాజులదిన్నె కింద రబీ పంటలకు దాదాపుగా 15వేల ఎకరాలకు సాగునీటిని విడుదల చేసేందుకు జిల్లా నీటిపారుదల సలహా మండలిలో తీర్మానించారు. కర్నూలులోనే కృష్ణరివర్‌బోర్డు మేనేజ్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కర్నూలు జిల్లాలోని 68 చెరువులను రానున్న వేసవి కాలంలోగా నీటిని నింపేందుకు ప్రభుత్వానికి నివేదిస్తూ తీర్మానించారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా అదనంగా పది టిఎంసిలు కర్నూలు జిల్లాకు కేటాయించాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ తాగునీటి సమస్యలను అత్యధిక ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వాటర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, సిపిడబ్ల్యూఎస్ పథకం కింద ఫిల్టర్ బెడ్స్, ఒఅండ్ఎం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మంత్రి ఆరా తీశారు. కొన్ని చోట్ల ఫిల్టర్ బెడ్స్, ఒఅండ్ఎం సమస్యలు గుర్తించామని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల వివరాలను తనకు అందించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి కోరారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి చోరీ కేసులపై మంత్రి అధికారులను ఆరా తీశారు. రూ.2.6 కోట్ల విలువ చేసే ఆయిల్, కాపర్‌చోరీ అయిందని, మోటార్లు రన్నింగ్ కండిషన్‌లోకి తీసుకొని వచ్చేందుకు తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని ఇరిగేషన్ అధికారులు వివరించారు..

కలెక్టర్ పి.రంజిత్ బాషమాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామాన్ని సందర్శించి, తాగునీటి సమస్యలను గుర్తించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిపిఒ, జడ్‌పి సిఇఒను ఆదేశించారు.. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కూడా ఈ అంశంపై సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి పథకాలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే జడ్పీ, మండల పరిషత్ నిధుల నుండి మరమ్మతులు చేయించాలన్నారు. పెద్ద సమస్యలు ఉంటే ఇప్పుడే నిధుల మంజూరుకు .. ఎస్ఎస్ ట్యాంక్ లు, చెరువులు నింపి తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. . హంద్రీ నీవా నీటితో 68 చెరువులను మార్చిలోపు నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సమావేశంలో ఎమ్మెల్యేలు గౌరు చరిత ,పార్థసారథి విరుపాక్షి ఎమ్మెల్సీ మధుసూదన్ పాల్గొన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జలవనరుల శాఖ ఎస్ ఈ బాలచంద్రా రెడ్డి, హంద్రీ నీవా ఎస్ఇ రామ్‌గోపాల్, కెసి కాలువ ఇఇ ప్రతాప్, తుంగభద్ర దిగువ కాలువ ఇఇ శైలేశ్వర్, ఆర్‌డిఎస్ ఇఇ భాస్కర్ రెడ్డి, చిన్న నీటి పారుదల ఇఇ శ్రీనివాసులు, 68 చెరువుల డిఇ రామకృష్ణ, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాయలసీమ వర్సిటీలో జరీనా కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె.నాయక్ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ఉర్దూ వర్సిటీలో ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ షావలిఖాన్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్లస్టర్ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శేషాద్రి, సుజాత పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నన్నూరు టోల్గేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ బిఇడి కళాశాలలో మండల విద్యాధికారులు ,ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో కూడా రాజ్యాంగ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ ప్రసంగించారు.

కర్నూలు కలెక్టరేట్ : మాధవి నగర్ మరియు రెవిన్యూ కాలనీ నందలి రవీంద్ర ఇంగ్లీష్ మీడియం మరియు టాలెంట్ స్కూల్ నందు జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా....ప్రార్థన సమయంలో రాజ్యాంగ విశిష్టత ను , రాజ్యాంగ పీఠిక ను కరస్పాండెంట్ పిబివి. సుబ్బయ్య చదివి వినిపించారు.



విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేయిస్తున్న పిబివి సుబ్బయ్య

వెల్దుర్తి : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నూకల శ్రీను, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అంజయ్య వెల్దుర్తి పాత బస్టాండ్ సర్కిల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కంచర్ల హరిప్రసాద్

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

బామ్‌సెఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పటల్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటని బామ్‌సెఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ సూచించారు. భారత రాజ్యాంగ 75వ దినోత్సవం సందర్భంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో న్యూ ఆడిటోరియంలో మెడికల్ విద్యార్థులకు రాజ్యాంగం పై అవగాహన కల్పించారు. బామ్‌సెఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలోని అంశాల పైన, ప్రాథమిక విధులు హక్కుల గురించి వివరించారు. రాజ్యాంగం అంటే రిజర్వేషన్లు మాత్రమే కాదని, ఎన్నో రకాల హక్కులు, బాధ్యతలను మన రాజ్యాంగం కల్పించిందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎస్‌సిలను ఉద్దేశించి రచించింది కాదని భారత పౌరులందరికీ దృష్టిలో ఉంచుకొని రాసిందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలో వెనుకబడిన కులాలకు సమాన గౌరవాన్ని అందించేందుకు కొన్ని ప్రత్యేకమైన అధికారాలు ఇచ్చారని అన్నారు. కులం, మతం, లింగ బేధాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. అంబేద్కర్ ఒక వర్గానికి చెందిన నాయ కుడు కాదని అందరికీ చెందిన వ్యక్తిఅని అన్నారు. రాజ్యాంగం అమలు అనేది పరిపాలించే పాలకులను బట్టి ఉంటుందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్, డాక్టర్ రాముడు, న్యాయవాదులు తార, శిరీష, బంగి సుధీర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన అవకాశాలు

కర్నూలు కలెక్టరేట్: కర్నూలు నగరంలోని ఎ క్యాంపు మైపర్ ఫార్మసీ కళాశాలలో రాజ్యాంగదినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలతో అలంకరించారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. దేశ పౌరులకు స్వాతంత్ర్యం, బావ ప్రకటనా స్వేచ్ఛ తదితర సమాన అవకాశాలను రాజ్యాంగం కల్పించిందన్నారు. డాక్టర్ రాజ్ కుమార్, రఘువీర్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ నివాళి అర్పిస్తున్న మైపర్ విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

'సైకో' పోయినా కార్యకర్తల్లో నిరాశ

- ఎన్‌డిఎ కార్యకర్తలకు అండగా ఉంటాం
- టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శివప్రసాద్
- ఆత్మీయ సమావేశంలో కనిపించని గౌడ్

ప్రజాశక్తి - ఆలూరు

'సైకో' పాలన పోయినా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు నిరాశగానే ఉన్నారని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. మంగళవారం ఆలూరులోని వాసవి కల్యాణ మండపంలో ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జనసేన ఐటి కోఆర్డినేటర్ బి.రంజిత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టినా నియోజకవర్గంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారంలో ఉన్నామా, లేదా అనే నిరాశతో ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి, రాష్ట్రంలో కూటమి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని చెప్పారు. అభ్యర్థి తప్పిదాలతో నియోజక వర్గంలో ఓటమి చవి చూడాల్సి వచ్చిందన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని, అండగా ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. బోయ/వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొజ్జమ్మను, డైరెక్టర్‌గా తోలు మంజునాథ్, కురుబ/కురుమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కెసి.ఉదయ్ కుమార్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం తోలు మంజునాథ్, కెసి.ఉదయ్ కుమార్‌కు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ప్రస్తుత టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సమావేశంలో కనిపించక పోవడం, ఫ్లెక్సీలలో ఆయన ఫొటో లేకపోవడంతో ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరామ్, ఆస్పరి మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, హాలహర్వి జడ్‌పిటిసి లింగన్న, టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్, అరికెర సర్పంచి నాగరాజు, మొలగవల్లి శీనప్ప, జనసేన మండలాల కన్వీనర్లు ఛత్రపతి, అరవింద్, అశోక్, చంద్ర, నందు, చిరంజీవి, శేఖర్, యశోద పాల్గొన్నారు.

ఎల్‌ఐసిని పరిరక్షించుకుందాం

- ఎఐఐఇఎ బ్రాంచి ప్రెసిడెంట్ ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని



నిరసనలో మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎఐఐఇఎ బ్రాంచి ప్రెసిడెంట్ ప్రకాష్, సెక్రటరీ రవిబాబు తెలిపారు. సిఐటియు లాంటి కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు దేశవ్యాప్త నిరసనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం లంచ్ అవర్‌లో మద్దతుగా ఎల్‌ఐసి బ్రాంచి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించే ప్రయత్నంలో ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎలాగైనా ప్రయివేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. నూతన పింఛను విధానం రద్దు చేయాలని, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇన్స్యూరెన్స్ రంగ యూనియన్‌గా కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐ ఆలోచనను విరమించాలని కోరారు. ఇన్స్యూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని తెలిపారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయండి

- విద్యుత్ ఎఇకి కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి - హొళగుంద



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హొళగుంద బీసీ కాలనీలోని 7వ వార్డులోని ఓ వీధిలో విద్యుత్ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. మంగళవారం కాలనీవాసులు, ఎపివిబిఎస్ వాల్మీకి నాయకులు విద్యుత్ ఎఇ ఓబులమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా తమ కాలనీలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరిందని, ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాలని కోరారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎఇ ఓబులమ్మ మాట్లాడుతూ... త్వరలోనే విద్యుత్ స్తంభాన్ని మార్చి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 7వ వార్డు సభ్యులు శశికుమార్, ఎపివిబిఎస్ వాల్మీకి నాయకులు రవి, సిద్ధు, కోనేరు సిద్ధప్ప, కొరివి గోవిందు, కొండ బాబన్న, పకీరప్ప పాల్గొన్నారు.

మోడీని గద్దె దింపాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు, కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే ప్రధానమంత్రి మోడీని గద్దె దింపాలంటూ నాయకులు కదం తొక్కారు. ఆదోని మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఎర్ర జెండాలు చేతబట్టి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రధానమంత్రిగా మోడీ బాధ్యతలు చేపట్టగానే కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే దిశగా అడుగులు వేశారని మండిపడ్డారు. బ్యాంకుల ద్వారా పెద్దలు తీసుకున్న కోట్లాది రూపాయలు మాఫీ చేసి పేదలపై భారం మోపిన ఘనత ఆయనకే దక్కిందని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రూ.28 వేల కనీస వేతనం ఇవ్వాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ కాకుండా చూడాలని కోరారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, లక్ష్మిరెడ్డి, కార్మిక సంఘాల నాయకులు రామాంజనేయులు, అజయ్ బాబు, గోపాల్, వీరారెడ్డి, వెంకప్ప, రామాంజనేయులు, ఒబి.నాగరాజు, మల్లయ్య, కల్లుబావి రాజు, రాజశేఖర్, నారాయణస్వామి, రాముడు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, వెంకప్ప, తిప్పన, అంగన్వాడీ నాయకులు మణి, వరలక్ష్మి, తిక్కన్న పాల్గొన్నారు. **కౌతాళం**లోని అంబేద్కర్ సర్కిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేపట్టారు. రైతు కూలీ సంఘం అధ్యక్షులు నాగేంద్రప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అవే విధానాలను అమలు చేస్తోందన్నారు. రమేష్, ఖాదర్, అక్రమ్, ఎల్లప్ప, ఈరన్న పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నాయకులు



కౌతాళంలో సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

- టిడిపి పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్

ప్రజాశక్తి - కౌతాళం

సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఇస్తున్న ఏకైక పార్టీ టిడిపి అని టిడిపి పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వం నమోదు చేపట్టారు. ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు, టిడిపి బీసీ సాధికారిక రాష్ట్ర సభ్యులు సిద్ధ, టిడిపి మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి రహిమాన్, గిడ్డయ్య, శివ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని 9వ వార్డులో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తెలుగు యువత నాయకులు కుక్కల వెంకటేష్, చారు సతీష్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ... సభ్యత్వం కలిగిన కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందని తెలిపారు. కేవలం రూ.100 సభ్యత్వంతో కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా వారి కుటుంబ సభ్యులకు అందుతుందని చెప్పారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో చర్చి సంఘ పెద్దలు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలోని ఎబిఎం చర్చిలో ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఘనం గా జరిగాయి. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణ చేసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. చర్చి ఫాస్టర్ సాధోక్ మోరిస్, సంఘ కార్యదర్శి సత్యరాజ్, కోశాధికారి సునీల్ కుమార్, పాస్టర్ రాజు, సేవకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు మురుగు కాలువలో చెత్తాచెదారం వేయకుండా ఉండాలని తెలిపారు. చెత్త సేకరణలో భాగంగా ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుడు తిమోతి మృతికి నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నివాళులర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికుడు తిమోతి మృతికి కోఆపరేటివ్ స్టోర్స్ ఛైర్మన్ గట్టు అల్తాఫ్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరికోట శాలెం నివాళు లర్పించారు. మంగళవారం పిఎసి కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్సీ కాలనీలో మున్సిపల్ వర్కర్ ఎస్.తిమోతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గట్టు అల్తాఫ్, కదిరికోట శాలెం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.4 వేలు అందజేశారు. కదిరికోట పెద్ద నరసన్న, సునీల్, వీరేష్ పాల్గొన్నారు.

ప్రచారమే..!

- చేరింది అంతంతమాత్రమే

ప్రజాశక్తి - ఆదోని

పేదల సొంతింటి కల కలగానే మిగిలింది. ప్రభుత్వాలు మారిన పేదల జీవితాలు మాత్రం మారడం లేదు. అధికారంలోకి రాగానే పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని చెబుతూనే ఉన్నారు. అధికారంలోకి రాగానే గృహాలు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని మరిచి 'అదిగో.. ఇదిగో' అంటూ కాలయాపన చేస్తూ పేదల సొంతింటి కలను కలగానే మిగులుస్తున్నారు.

టిడ్కో గృహాల్లో చేరాలని, అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని అధికారులు చెబుతూనే ఉన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి సారథ్యంలో గతనెలలోనే ఇళ్లలో చేర్పిస్తామని భారీగా ఆర్భాటాలు చేశారు. ఇంతవరకు కేవలం 9 మంది మాత్రమే టిడ్కో గృహాల్లో నివాసముంటున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ఇందిరమ్మ గృహాలు, టిడ్కో గృహాలు, జగనన్న కాలనీ, ఎన్‌టిఆర్ గృహాలు అంటూ పథకాలు అమలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే మగ్గిపోతున్న పరిస్థితి ఉంది.

సౌకర్యాలు నిల్

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పట్టణ శివారులోని సిరుగుప్ప రోడ్డులో టిడ్కో గృహ సముదాయ నిర్మాణం చేపట్టింది. అప్పట్లో గృహ నిర్మాణం 90 శాతం పూర్తయిందని, గృహాల కేటాయింపు కూడా జరిగిందని, గృహ ప్రవేశాలు కూడా చేయించామని అధికారులు, నాయకులు అప్పట్లో హంగామా చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టిడ్కో గృహ సముదాయాన్ని వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా జగనన్న కాలనీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల దృష్ట్యా టిడ్కో గృహాల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల పేరుతో ఉన్న అప్పును అప్పటి ప్రభుత్వమే చెల్లించి రూపాయికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది. లబ్ధిదారులు గృహాల్లో చేరేందుకు ముందుకు రాకపోవడంతో ఇప్పటికీ గృహ సముదాయం నిరుపయోగంగా ఉంది. 435 స్క్వేర్ మీటర్ల విస్తీర్ణం గల గృహాలు 352, 365 స్క్వేర్ మీటర్ల విస్తీర్ణం గల 160 ఇళ్లు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నారు. ఇళ్లు నిరుపయోగంగా ఉండడంతో బేస్ లెవెల్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. గృహాలు నిర్మించి పదేళ్లు గడవడం, ఎవరూ లేకపోవడం వల్ల కూడా ఇళ్లు నిరుపయోగంగా మారాయి. డోర్లు, కిటికీలు, ఫ్లోర్ లెవెల్‌లో లీకేజీ ఏర్పడడం వంటి సమస్యలు ఉన్నాయని కొందరు లబ్ధిదారులు చెబుతున్నారు.

30 మంది మాత్రమే సుముఖత

పట్టణ శివారులో నిర్మించిన గృహ సముదాయంలో 4,700 గృహాలు నిర్మించారు. అందులో 2 వేలు పూర్తయ్యాయి. 300 ఇళ్లలో లబ్ధిదారులు చేరేందుకు అంతా సిద్ధం చేశారు. అక్కడ తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం కల్పిస్తామని ఉన్నతాధికారులు ప్రకటన కూడా చేశారు. కేవలం 30 మంది మాత్రమే ఇళ్లల్లో చేరినప్పటికీ వారు కూడా రాత్రి వేళల్లో ఉండలేక వెనుదిరిగి పోతున్నారు. అక్కడ రవాణా సౌకర్యం లేదని, మార్కెటింగ్ సదుపాయం లేదని చెబుతున్నారు. గృహాల చుట్టూ కంప చెట్లను తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్లంబింగ్ వర్క్స్, ఆర్‌టిసి బస్సు సదుపాయం కల్పిస్తామని చెబుతున్నా చేరేందుకు లబ్ధిదారులు అయిష్టత కనబరుస్తున్నారు. లబ్ధిదారులు చేరకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా ఇళ్లల్లో చేరేలా చూడాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉండడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికి 9 మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. ఇప్పటికైనా తాగునీటి సౌకర్యం కల్పించాలని, మరమ్మతులు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



బేస్‌లో పగుళ్లు వచ్చిన ఇల్లు

మహారాజశ్రీ కర్నూలు జిల్లా ఏడవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో	
యం.వి.ఓ.పి . నెం. 219/2024	
యన్.మారెన్న.	...అర్జీదారు
-ఎదురు-	
వై.సుమన్ బాబు మరియు ఇతరులు.	...రెస్పాండెంట్లు

1వ రెస్పాండెంట్ కు నోటీసులు

1. వై. సుమన్ బాబు తండ్రి వై. కృష్ణమూర్తి, మేజరు, కారు ఓనరు మరియు డ్రైవరు, కారు బేరింగ్ నెంబర్. ఏ.పీ 40 ఏజి 9 198, ప్రస్తుత నివాసము, ఇంటి. నెంబరు. 87/ 1109-ఎ -19- సి-1, నాలుగవ తరగతి ఎంప్లాయిస్ కాలనీ, ఆర్.డబ్ల్యూ.87, కర్నూలు టౌన్.

పై నెంబర్ యం.వి.ఓ.పి.లో అర్జీదారు 26-5- 2024వ తేదీన తనకు రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయములకు నష్టపరిహారము మూడు లక్షలు ప్రమాదం జరిగిన రోజు నుండి 12% పి. ఎ. ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పైకోర్టులో అర్జీదాఖలు చేసి ఉన్నాడు. ఇందులో ఒకటవ రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణ ఉన్న 3-12- 2024వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుసుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 03-12-2024

బి.రాజు,
యస్. డేనియేలు,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి కోర్టులో	
ఓ.యస్. నెం. 122/2016	
టి.అల్లస్వామి రెడ్డి.	...వాది
-ఎదురు-	
సి.వేణుగోపాల్ రెడ్డి మరియు ఇతరులు.	...ప్రతివాదులు

ప్రతివాదులు 3,4,5 మరియు 6 లకు దావా సమన్లు

3) సరోజమ్మ భర్త అల్ల స్వామి రెడ్డి తండ్రి చెన్నూరు చిన్న పుల్లారెడ్డి, ప్రస్తుత నివాసము, తిప్పాయపల్లి గ్రామము, ఓర్వకల్ మండలం కర్నూలు జిల్లా.
4) సులోచనమ్మ భర్త రాజగోపాల్ రెడ్డి, ప్రస్తుత నివాసము, ఆల్లుగోడ గ్రామం, గడివేముల మండలం, కర్నూలు జిల్లా.
5) సి.సోమశేఖర్ రెడ్డి తండ్రి లేటు చెన్నూరు చిన్న పుల్లారెడ్డి, ప్రస్తుత నివాసము, తిప్పాయపల్లె గ్రామం, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా.
6). సి.రవికుమార్ రెడ్డి తండ్రి లేటు చెన్నూరు చిన్న పుల్లారెడ్డి, ప్రస్తుత నివాసము తిప్పాయపల్లె గ్రామం, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా.

పై దావలోని వాది Specific performence దావా వేసియున్నారు. పైన కనపరిచిన 3 నుండి 6 వరకు గల ప్రతివాదులకు నోటీసులు ముట్టిన ముట్టనందున కోర్టు వారు ఈ పత్రిక పరంగా నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసి ఉన్నారు. కావున పై దావా పై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 12-12-2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు కాని మీ తరపు వకీల్ ద్వారా కాని హాజరై తెలుపుకొనగలరు. లేనియెడల సదరు దావ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 12-12-2024

ఎస్.బాబు సాహెబ్,
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు.

కర్నూలు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
I.A. No. 67/2024 in I.A. 157/2022
in A.S. 39/2021

కురుషీద్ అక్తర్ వగైరాలు	... అర్జిదారులు
Vs	
కె. నాగేశ్వరరెడ్డి వగైరాలు	... రెస్పాండెంట్లు

నోటీసు 21వ రెస్పాండెంటు

పై కేసులోని అర్జిదారురాలు 21వ రెస్పాండెంటు రఫూబీ D/o. అబ్దుల్ వాహిద్‌కు నోటీసులు పంపినను ముట్టనందు వలన పేపరులో తెలియ జేయడమైనది. తమకేమైన అభ్యంతరములున్నచో ఖుద్దున గాని వకీలు ద్వారా గాని ఉదయం 10-30 గంటలకు తేది 9-12-2024 పై కోర్టులో హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

కోర్టు వుత్తరువు మేరకు

ఎస్.చాంద్ బాషు,
అర్జీదారు వకీలు
కర్నూలు.

అడ్రసు 2వ రెస్పాండెంటు
షేక్ రఫూబీ,
D/o. లేటు అబ్దుల్ వాహిద్
R/o. H.No. 46/363/A,
అమీన్ బాష దర్గ దగ్గర,
బుధవారపేట, కర్నూలు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు గురురాజారావు, రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన బిఎ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు ఎంకె.గురురాజారావు హాజరయ్యారు. ముందుగా భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రతిమకు కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, గురు రాజారావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు గోరంట్ల, కళాశాల అధ్యాపకులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గురురాజారావు, తిరుమలరెడ్డి మాట్లాడారు. ప్రపంచంలోని రాజ్యాంగాలన్నిటిలో భారత రాజ్యాంగం అతిపెద్దదని, భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఒక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేశారని తెలిపారు. 1946 డిసెంబర్ 9న ఢిల్లీలో జరిగిన రాజ్యాంగ పరిషత్ నిర్ణయం మేరకు 1947 ఆగస్టు 29న రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షులుగా అంబేద్కర్‌ను నియమించారని చెప్పారు. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను పరిశీలించి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు రాజ్యాంగాన్ని రాసి 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించారని తెలిపారు. ఆనాటి నుంచి భారత ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవంగా ఏటా జరుపుతున్నట్లు చెప్పారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ స్వేచ్ఛాయుత, సమానత్వ, లౌకిక వ్యవస్థలను కల్పించిందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు విధులను కూడా విస్మరించకూడదని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ పరిరక్షణపై దృష్టి సారించాలని కోరారు. బిఎ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థులు పార్లమెంట్ నమూనాలు, అసెంబ్లీ నమూనాలు, ప్రాథమిక హక్కులు-విధుల చార్టులు, అంబేద్కర్ చిత్రపటాలు తయారు చేసి రాజ్యాంగ దినోత్సవ విజయవంతం చేశారు. అనంతరం ముఖ్యఅతిథి గురు రాజారావును కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల సిఒఒ సుజనారెడ్డి, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయ్ కుమార్, స్క్రిప్ట్ రైటర్ ఎస్.పాల్ రాజ్, చరిత్ర అధ్యాపకులు నరసింహులు, అన్నపూర్ణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నందిని, నూర్ బాష, మనో, వెంకట్, సంపత్, శ్రుతి ప్రియా, సంధ్య, ధనుంజయ, గోవిందు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మాచుమాన్ దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు ఎలా జరుగుతాయో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. స్పీకర్, ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మొదలైన పాత్రలతో విద్యార్థులు చక్కగా అభినయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వీరేష్, మునిస్వామి, అపర్ణలత ముఖ్య అతిథులుగా మెడికల్ క్యాంపునకు హాజరైన మెడికల్ ఆఫీసర్ సాయికిరణ్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ పాల్గొన్నారు. అలాగే పట్టణంలో టిడిపి నాయకుల కదిరికోట ఆదెన్న ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టి, బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రోజా ఆర్ట్స్ ..., ఎరుకల చరణ్, ఎస్.సాల్మన్, జాలవాది విన్సెంట్, జగతాప్ జై పాల్, పంచికిన సురేష్, వన్నెల మెన్షి, కదిరికోట ప్రభుదాసు, సందెపోగు రాములు, బొగ్గుల మహేష్, హనుమంతు, సాగర్, చిన్న, సూరపోగు మధు పాల్గొన్నారు. **చిప్పగిరి**లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. హౌసింగ్ ఎఇ భవ్య, అసిస్టెంట్ అధికారి నరసింహులు, ప్రధానోపాధ్యాయులు లతీఫ్, సిఆర్‌పిలు నెట్టికల్లు, వెంకటేష్ పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ పుల్లయ్య, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎల్లప్ప, ప్రసాద్, బసవరాజు, పరమేష్, పార్వతి, శేఖరప్ప, విజయలక్ష్మి, ప్రమీల, సిఆర్‌ఎంటి ఉరుకుంద పాల్గొన్నారు. **ఆస్పరి** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ గీతావాణి, జడ్‌పిటిసి దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శివశంకర్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి, సచివాలయంలో మూలింటి రాధమ్మ, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్రలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు లేసి నివాళులర్పించారు. అనంతరం ఇఒఆర్‌డి విజయభాను అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, వెలుగు ఎపిఎం జనార్దన్ పాల్గొన్నారు. **ఆదోని**లో లీగల్ సెల్ అధికార ప్రతినిధి ఎం.జనార్దన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది బి.వీరేష్ మాట్లాడారు. న్యాయవాదులు మస్తాన్‌వలి, డి.రమేష్, టి.లక్ష్మీకాంత్, శివరామకృష్ణ, రాజాసాబ్ పాల్గొన్నారు. **మంత్రాలయం**లో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమయ్య మాదిగ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ హాజరయ్యారు. సోగనూరు గ్రామానికి చెందిన ఆనంద్ రచించిన 'జయహో జానయ్య' పాటను జైభీమ్ ఎంఆర్‌పిఎస్ కోసిగి మండల అధ్యక్షులు రాజేష్ చేతుల మీద విడుదల చేశారు. అంతకుముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి రాగసుధ లాడ్జి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, జిల్లా నాయకులు ప్రశాంత్ కుమార్, సత్యన్న, రత్నం, మంత్రాలయం ఇన్‌ఛార్జీ సంఘటి యోహాను, నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, మారెప్ప పాల్గొన్నారు. అలాగే మంత్రాలయం ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ ప్రభావతి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపిఒ తిమ్మారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ బాష, కార్యదర్శులు ఇస్రత్ బాష, గౌతమి, కంప్యూటర్ ఆపరేటర్ హరిప్రియ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని తహశీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ లోకేశ్వరరావు, ఎంఆర్‌పిఎస్, జైభీమ్ యూత్ నాయకులు సుధాకర్, సోమన్న, జైభీమ్ వైస్ ప్రెసిడెంట్ నర్శమల మునిస్వామి, ఎంఆర్‌పిఎస్ నాయకులు మాచాపురం ఈరన్న, మద్దిలేటి, ధర్మ, గద్దరాళ్ల సూరి, పెద్దిరాజు పాల్గొన్నారు. **హాలహర్వి**లో సర్పంచి మల్లికార్జున ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిఎల్‌పిఒ వీరభద్రప్ప మాట్లాడారు. ఎంపిడిఒ వరలక్ష్మి, ఎపిఒ చక్రవర్తి, ఎపిఎం శివయ్య పాల్గొన్నారు. **హొళగుంద** మండలంలోని ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శివశంకర్, విద్యా కమిటీ ఛైర్మన్ బోయ లక్ష్మీ, వైస్ ఛైర్మన్ హరిజన మహేష్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కౌతాళం**లో దళిత సమైక్య వ్యవస్థాపకులు కట్ట స్వామి దాస్ డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సమైక్య నాయకులు ప్రభాకర్, విజయ్ కుమార్, ప్రకాష్, ముఖేష్ పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న గురురాజారావు



చిప్పగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



నందవరంలో



హొళగుందలో




ఆస్పరిలో నివాళులర్పిస్తున్న అధికారులు



మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు



దేవనకొండలో



కౌతాళంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నాటుసారా క్రయ, విక్రయాలపై చర్యలు

- ఎస్ఐ దిలీప్ కుమార్

ప్రజాశక్తి - ఆలూరు

నాటుసారా తయారీ దారులు (క్రయ, విక్రయ దారుల)పై చర్యలు తప్పవని ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. మంగళ వారం సమాచారం మేరకు హొళగుంద మండలం నెరణికి తండాకు చెందిన విజయ నాయక్ 30 లీటర్ల నాటుసారాను ద్విచక్ర వాహనంపై ఆలూరుకు అమ్మకానికి తెస్తుండగా సారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యక్తిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సోమన్న మృతి బాధాకరం

- మిత్రబృందం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పెద్ద మర్రివీడు సోమన్న మృతి బాధాకరమని మిత్రబృందం టీచర్ శాంతిరాజు, టీచర్ దావీదు, టీచర్ వేణుగోపాల్, టీచర్ భాస్కర్, ఎస్ఐ ఈరన్న, అడ్వకేట్ ఛార్లెస్ తెలిపారు. మంగళవారం సోమన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సహాయం అందజేశారు. సోమన్న పేదరికంతో ఉండి అనేక కష్టాలు ఎదుర్కొని, అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. సోమన్న విద్యార్థి ఉద్యమంలో ఎస్ఎఫ్ఐ అండగా ఉండడంతో పాటు సిపిఎం సానుభూతిపరులుగా కొనసాగారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి కోర్టు
(సీనియర్ డివిజన్) :: ఆదోని
I.P. No.37/2024

Between :
బాలన్నగారి రాజేంద్ర S/o బాలన్నగారి తిక్కయ్య R/o మల్లికార్జునపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ... పిటీషనర్

V/s.

1) మండ్ల శ్రీనివాసులు, S/o ఎం. హనుమంతప్ప R/o మల్లికార్జునపల్లె గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. (2) బి. శేఖర్, R/o కోగలతోట గ్రామం, హొళగుంద మండలం, కర్నూలు జిల్లా. (3) యు. రాము, S/o యు. వెంకటేష్, R/o జంగమర హోస్పల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. .... రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన పిటిషనర్ అయిన బాలన్నగారి రాజేంద్ర గారు గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ఆదోనిలో పైన కనపరచి రెస్పాండెంట్స్ పై దివాలా దావా దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా ఇందుపైకి ఆక్షేపణలుగాని మరియు అభ్యంతరములుగాని వున్న యెడల తేదీ: 03-01-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును, ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటిషనర్/దివాలాదారుని పరముగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 03-01-2025

శ్రీ కె. విరుపాక్ష రెడ్డి,
శ్రీ D.I.V. విజయరాజు,
పిటీషనరు తరపు అడ్వొకేట్స్, ఆదోని -518301.